ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 1 మార్చి 2024





హెలిపాడ్ దిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు



సభావేదిక ప్రాంగణాన్ని చదును చేసి పనులు చేస్తున్న దృశ్యం

భారీగా.. రా.. కదలిరా

- రేపు దాచేపల్లిలో సభ
- జన సమీకరణకు విస్తృత ఏర్పాట్లు
- విజయవంతం చేయాలని నేతల ప్రచారం
- శ్రీకృష్ణదేవరాయలు, మక్కెన సహా పలువురి చేరికలు

(పిడుగురాళ్ల, గుంటూరు సిటీ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ సమీకరణలు చకచకా మారుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం రా.. కదలిరా సభ నిర్వహణకు టీడీపీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావాలని టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రా కదలిరా సభకు గురజాల సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన తిరుమల కోల్డ్ స్టోరేజి పక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు రాష్ట్ర నేతలు పాల్గొననున్నారు. చంద్రబాబు పాల్గొంటున్న సభను ప్రతిష్టాత్మకంగా స్వీకరించిన నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అసెంబ్లీ అభ్యర్థులు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు తరలివచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో గ్రామాలు, పట్టణాల్లో సభకు సంబంధించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కేడర్‌లో సమరోత్సాహం

పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం గురజాలలో జరిగే రా కదలిరా సభ నిర్వహణతో పార్టీ క్యాడర్‌లో సమరోత్సాహం నెలకొంది. ఇప్పటికే పల్నాడు జిల్లా వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా గురజాలకు యరపతినేని శ్రీనివాసరావు పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతుండటం.. ఈ నియోజకవర్గ పరిధిలో సభ ఏర్పాటుతో ఆయన నేతృత్వంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ విజయవంతానికి క్యాడర్‌ను సమాయత్తపరుస్తున్నారు. దాచేపల్లి సభలో వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సహా పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఈ అంశాన్ని లావుతో పాటు మక్కెన గురువారం ధ్రువీకరించారు. టీడీపీలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా చేరతారన్న ప్రచారం ఉంది. అయితే ఆయన చేరిక సందిగ్ధంలో ఉందని టీడీపీ నేతలు తెలిపారు. తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని జంగా చెబుతున్నారు. ఆయన ఇంకా వైసీపీకి రాజీనామా కూ డా చేయలేదు. అయి తే జంగా అభ్యర్థి త్వంపై టీడీపీ అధిష్ఠానం నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే.

గురజాల సెంటిమెంట్ నేపథ్యంలో..

ఎన్నికలకు ముందు, అభ్యర్థుల ప్రకటన తర్వాత నిర్వహిస్తున్న రా.. కదలి రా సభతో పల్నాడులో యరపతినేని శ్రీనివాసరావు జనజాతరకు తెరలేపారు. హఠాత్తుగా ఖరాయిన ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సభ మొత్తం పల్నాడు జిల్లా ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. చంద్రబాబుకి పల్నాడులో గురజాల సెంటిమెంట్ బలంగా ఉంది. అందుకు తగ్గట్లుగా రా కదలిరా సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడ నుంచి కార్యక్రమం ఆరంభిస్తే విజయం తథ్యమన్న ఆలోచన ఉంది. 2014లో కూడా గురజాల నియోజకవర్గం పొందుగల నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించి గద్దెనెక్కారు. ఆ ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. ఇప్పుడు కూడా పూర్వపు వైభవం దిశగా అడుగులు వేసేందుకు గురజాలలో సభ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో పల్నాడులో టీడీపీ క్యాడర్ తీవ్రఒత్తిడికి గురౌతుంది. ఈ పరిస్థితుల్లో రా కదలిరా సభ క్యాడర్‌కు వెన్నుదన్నుకానుంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీ నేతలకు చంద్రబాబు ఈ సభ సాక్షిగా నేరుగా వార్నింగ్ ఇవ్వనున్నారు. క్యాడర్‌ను ఎన్నికలకు సర్వసన్నద్ధం చేసేందుకు ఈ పర్యటన ఉపకరిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్ష మందితో సభను నిర్వహించి తద్వారా ప్రత్యర్థుల శిబిరాన్ని మానసికంగా దెబ్బతీసేందుకు యరపతినేని పావులు కదుపుతున్నారు. గ్రామాలను ప్రభావితం చేయడంతో పాటు, ఎన్నికల గెలుపు ఓటమిని ప్రభావితం చేయగలిగిన నేతలు చంద్రబాబు సమక్షంలో తిరిగి పార్టీలోకి రానున్నట్లు తెలుస్తోంది.

చారిత్రాత్మకంగా సభ : యరపతినేని

గురజాలలో రా.. కదలిరా మరో చారిత్రాత్మక సభగా మిగిలిపోనున్నదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లి సమీపంలో జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబరులో ఆత్మగౌరవయాత్ర స్ఫూర్తితో రా.. కదలిరా సభ విజయవంతం చేస్తామన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో జరిగిన రా.. కదలిరా సభలకన్నా గురజాల సభ భారీగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవ్వాలని కోరారు. లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కదలి రావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ముఖ్యనేతలు కూడా ఈ సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.



సభావేదిక ప్రాంగణం వద్ద ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

రేపు టీడీపీలో చేరుతున్నా : ఎంపీ లావు

దాచేపల్లిలో జరిగే రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు తరలిరావాలని పిలుపిచ్చారు. ప్రజా సంక్షేమం, పల్నాడు అభివృద్ధికి కట్టుబడి మరలా నరసరావుపేట లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అభివృద్ధి సాధించేందుకే తన ప్రతి అడుగు, ఆలోచన ఉంటుందన్నారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో సాధించుకున్న ప్రగతి పనులను పూర్తి చేసుకోవడంతో పాటుగా రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు సాధించుకునేందుకు ప్రజలు మళ్లీ తనను ఆశీర్వదించాలని కోరారు.



పది విద్యార్థుల కోసం ఫోన్లు

- పరీక్షలు ప్రారంభం కాకున్నా రంగంలోకి
- తల్లిదండ్రులకు జూనియర్ కళాశాలల నుంచి కాల్స్
- మీ అబ్బాయి/అమ్మాయిని చేర్పించమని డబ్బా కొట్టుడు
- ఇప్పుడు సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజు రాయితీ అని బేరసారాలు
- అసలు తమ నెంబర్లు వారి చేతికి ఎలా వెళ్లాయని తల్లిదండ్రుల ఆవేదన



గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఇంకా పరీక్షలే ప్రారంభం కాలేదు. అయినప్పటికీ కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇప్పటి నుంచే విద్యార్థులకు గాలం వేసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి అదే పనిగా రిసెప్షనిస్టుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తూ మా కాలేజీలో చేర్పించమని ఏవేవో చెబుతూ వల విసురు తున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అంటే ఏప్రిల్ మొదటి వారం వరకు పదో తరగతి విద్యార్థులు పరీక్షల హడావుడిలో ఉంటారు. ఆయా పరీక్షలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆ హడావుడిలో ఉంటారు. అయితే ఇంకా పరీక్షలు ప్రారంభం కాకున్నా ఫిబ్రవరి చివరి వారం నుంచి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. ఆలస్యమైతే ఎక్కడ విద్యార్థులు చేజారి పోతారేమోనని ఆతృత పడుతున్నాయి. దీంతో వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించాయి. ఆ ప్రకారం వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిల్లల్ని తమ కళాశాలలోనే చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. తమ కళాశాల మిగిలిన కళాశాలల కంటే గొప్ప అని ఐఐటీ, నీట్ సీట్లు సాధించామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పుడే సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, పరీక్షలు/ఫలితాల తర్వాత అయితే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బేరసారాలు చేస్తున్నారు. కొన్ని కళాశాలలు అయితే ఎంట్రన్స్ టెస్టు రాసేందుకు తీసుకురావాలని కోరుతున్నాయి. చాలా పాఠశాలలకు అనుబంధ కళాశాలలు కూడా ఉండటంతో వాటి యాజమాన్యాలు ఎలాగైనా తమ విద్యార్థులను బయటకు పోకుండా చేసేందుకు వివిధ రీతుల్లో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇతర కళాశాలలకు పోతారేమోనని తమ వద్ద చదువుతున్న పదో తరగతి విద్యార్థులకి ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ జాగ్రత్త పడుతున్నాయి.

అడ్వాన్స్ అడ్మిషన్లు..

కొన్ని కళాశాలలు అడ్వాన్స్ అడ్మిషన్లు కూడా చేపట్టాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను చేర్చుకుని వారి తల్లిదండ్రుల వద్ద అడ్వాన్స్ ఫీజులు కూడా జమచేసుకున్నాయి. 10వ తరగతి పరీక్షలు అయిపోయిన కొద్ది రోజులకే ఆన్‌లైన్ క్లాస్‌లు కూడా ప్రారంభిస్తామని సమాచారం ఇస్తున్నాయి. కాగా తమ ఫోన్ నెంబరు డేటా లీక్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యా శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి కమీషన్ల కోసం తమ పర్సనల్ నెంబర్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


విద్యా శాఖ నుంచి వివరాలు లీకు

పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన డేటా విద్యా శాఖ వద్దనే ఉంటుంది. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆధార్, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను కూడా అందులో నింపించారు. ఇప్పుడు ఆ డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చేరిందంటే కచ్చితంగా లీకు వీరులు విద్యాశాఖలోనే ఉన్నారని స్పష్టమౌతున్నది. ఇందుకోసం ఆయా కళాశాలల నుంచి అమ్యామ్యాలు ముట్టినట్లు సమాచారం. విద్యార్థుల డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలల చేతికి చిక్కడంతో వారి తల్లిదండ్రులకు నిత్యం మూడు నుంచి ఐదు కళాశాలల రిసెప్షనిస్టులు ఫోన్లు చేస్తున్నారు. పరీక్ష రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విధమైన ఫోన్‌కాల్స్‌తో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒకసారి వచ్చిన ఫోన్ నెంబర్‌ని బ్లాక్ చేసినా వేరే నెంబర్ల నుంచి ఫోన్లు చేసి వేధిస్తున్నారు.

తిరునాళ్లకు.. సాగర్

- నేడు సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు నీటి విడుదల

నరసరావుపేట, ఫిబ్రవరి 29: కోటప్పకొండ తిరునాళ్లలో నీటి వెతలు తీరనున్నాయి. తిరునాళ్ల కోసం సాగర్ నీటిని సరఫరా చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాగర్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కేఆర్ఎంబీ చేస్తోంది. మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చిందని జలవనరుల శాఖ ఎస్సీ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నీటిని తాగునీటి చెరువులు నింపేందుకు, కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. కుడికాలువ నుంచి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా చేస్తామన్నారు. జీబీసీ నుంచి చిలకలూరిపేట మేజర్‌కు నీటిని సరఫరా చేయనున్నట్టు చెప్పారు. నరసరావుపేట, చిలకలూరిపేట మునిసిపాల్టీ చెరువులను నింపుకొనేందుకు నీటిని వినియోగించు కోవాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలకు చిలకలూరిపేట మేజర్‌లో నీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటప్పకొండ దిగువన ఉన్న చెరువులను నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



సాగర్ కుడికాలువ

జీవో 117ని రద్దు చేయాలి

- బాపట్ల, రేపల్లెలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

బాపట్ల టౌన్, రేపల్లె, ఫిబ్రవరి 29: విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్స్ ఆధ్వర్యంలో బాపట్ల ఎస్డీవో కార్యాలయం, రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు జరిగాయి. బాపట్లలో జరిగిన నిరసనలో ఏపీటీఎఫ్ నాయకులు వెంకటరత్నం, శివనాగరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీ రవి, సీహెచ్ శ్రీనివాస్, చెన్నకేశవులు, ఎంవీ సత్యనారాయణ, డి.కృష్ణ, ఎండీ రఫీ, పి.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. పీఆర్సీ మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏరియా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎంసీహెచ్ రాజారత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

టీడీపీ.. జోష్

- విజయం దిశగా.. పయనం మొదలెట్టిన తెలుగుదేశం
- అభ్యర్థుల జాబితా విడుదలతో మరింతగా ప్రజలతో మమేకం
- పొంతనలేని ప్రకటనలతో గందరగోళంలో వైసీపీ
- అసహనంతో ఫేక్ ప్రాపగాండకు దిగుతున్న పాలకపార్టీ
- తెలుగుదేశంలోకి ఊపందుకున్న వలసలు

బాపట్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆయా నియోజకవర్గాల్లో బరిలోకి దిగే అభ్యర్థులను టీడీపీ ప్రకటించడంతో నేతలతో పాటు శ్రేణుల్లో జోరు పెరిగింది. ఇప్పటికే ప్రజా సమస్యల మీద పోరాడుతూ నిత్యం ప్రజాబాహుళ్యంలో ఉంటున్న ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇప్పుడు మరింతగా ప్రజలతో మమేకం అవుతూ విజయం దిశగా పయనం మొదలెట్టారు. మరో వైపు టీడీపీలోకి వలసల పర్వం గతంతో పోలిస్తే ఊపందుకుంది. ఇదిలా ఉంటే అధికారపార్టీలో గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇంకాస్త మెండుగా గందరగోళం రాజ్యమేలుతోంది. ఇప్పటికే ప్రకటించిన ఇన్‌చార్జిల విషయంలో పార్టీ పెద్దలు పొంతనలేని ప్రకటనలు చేస్తుండడం ఒక ఎత్తయితే, కొత్త ఇన్‌చార్జిలకు ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణుల సహాయ నిరాకరణ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. రోజురోజుకు ప్రజల్లో దిగజారుతున్న పార్టీ ప్రతిష్ఠను చూసి వైసీపీ నేతల్లో అసహనం పెరిగి ఫేక్ ప్రాపగండ ద్వారా లబ్ధి పొందాలనే నీచస్థితికి దిగజారారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

అయిదు సీట్లకు అభ్యర్థుల ప్రకటన..

తాజాగా టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాలకు గాను చీరాల మినహాయిస్తే అయిదింటికీ బరిలో ఉండబోయే వారిపేర్లను తెలుగుదేశం ప్రకటించిన సంగతి తెలిసిందే. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో 2019ల్లో గెలుపొందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోమారు అవకాశమిచ్చిన టీడీపీ, వేమూరులో మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు పోటీలో ఉంటారని తెలిపింది. బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

సమరోత్సాహంలో తెలుగుదేశం పార్టీ..

నిన్నమొన్నటి వరకు పాలకపార్టీ వైఫల్యాలను సమర్థంగా ఎండగట్టిన టీడీపీ అభ్యర్థులు ప్రకటన చేశాక గేరుమార్చి మరింతగా దూకుడు పెంచారు. ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాలను సావధానంగా వింటూ తమ ప్రభుత్వ మొచ్చాక చేయగలిగే మంచిని విస్తృతంగా జనంలోకి తీసుకెళుతున్నారు. మరోవైపు గతంలోనే టీడీపీలోకి చేరికలు ముమ్మరంగా సాగాయి. కానీ గడచిన రెండుమూడురోజుల నుంచి వలసల పర్వం మరింతగా ఊపందుకోవడం టీడీపీ జోరుకు నిదర్శనంగా కనబడుతోంది. వేమూరు మండలం వరాహాపురం గ్రామానికి చెందిన వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులతో పాటు మరి కొంతమంది సోమవారం మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు సమక్షంలో పార్టీలో చేరగా, బాపట్లకు చెందిన వైసీపీ అసమ్మతి నేత కళ్లం హరినాథరెడ్డికి అధినేత చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం టీడీపీ పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతకు అద్దం పడుతోంది. అద్దంకిలో ఈ వలసల పర్వం అయితే దాదాపుగా పాలకపార్టీ ఖాళీ అవుతుందా అనే దిశగానే సాగుతోంది. పర్చూరు, రేపల్లె నియోజకవర్గాల్లో సైతం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికల పర్వం గత కొన్ని రోజులుగా సాగుతూనే ఉంది.

గందరగోళంలో వైసీపీ..

రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాలకు గతంలోనే సమన్వయకర్తలను ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం తాజాగా పర్చూరులో సైతం మార్పు చేపట్టింది. పార్టీ పగ్గాలు తీసుకుని నెలలు గడుస్తున్నా ఆయా నియోజకవర్గాల్లో సమన్వయకర్తలకు శ్రేణుల నుంచి సహకారం దక్కకపోగా మాజీల లో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి హనిమిరెడ్డికి వ్యతిరేకంగా గళం విప్పిన కృష్ణ చైతన్య తాజాగా టీడీపీ అధినేత చంద్రాబాబుతో భేటీ అయిన సంగతి తెలిసిందే. రేపోమాపో ఆయన పార్టీలో చేరడం ఖాయమని తెలుస్తోంది. దీంతో నూతన ఇన్‌చార్జి ప్రయోగం బెడిసికొట్టడమే కాకుండా వైసీపీ దశదిశ లేకుండా తయారయిందనే అభిప్రాయాన్ని సొంత పార్టీ శ్రేణులే వ్యక్తం చేస్తున్నాయి. రేపల్లె, వేమూరు లో అయితే వైసీపీ గందరగోళ స్థితి పార్టీ కేడర్‌ను నైరాశ్యంలో ముంచేసింది. ఇక పర్చూరులో మార్పు చేపట్టినా అప్పటికే జరగాల్సిన నష్టం భారీగా జరగడంతో శ్రేణుల్లో పెద్దగా కదలిక లేని స్థితి కనిపిస్తోంది.

అసహనంతో ఫేక్ ప్రచారం.. అనైతిక చర్యలు...

అనేక బాలారిష్టాలను ఆయా నియోజకవర్గాల్లో వైసీపీని వెంటాడుతుండడంతో అసహనంతో రగలిపోతున్న నేతలు, శ్రేణులు టీడీపీ నేతలే లక్ష్యంగా ఫేక్ ప్రచారాన్ని ప్రయోగిస్తున్నారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని లక్ష్యంగా ఇటీవల వైసీపీ ఈ ఫేక్ ప్రాపగండకు తెగబడింది. ఏకంగా ఆయనకే బోగస్ కాల్ రావడంతో అది విని నవ్వుకున్నానని సోషల్ మీడియా వేదికగా వైసీపీ కుట్రలను తిప్పికొట్టారు. ఇదొక ఉదాహరణ మాత్రమే దాదాపు ప్రతి నియోజకవర్గాల్లో ఇదే రకమైన కుట్రలకు వైసీపీ తెగబడుతోంది. మండల స్థాయిల్లో కీలకంగా వ్యవహరించే టీడీపీ నేతల పట్ల కూడా ఫేక్ పబ్లిసిటీతో వారిని ఆత్మరక్షణలోకి నెట్టేవిధంగా దుష్ట పన్నాగాలను పాలకపార్టీ రచిస్తోంది. మరోవైపు ఆయా అంశాలపై సమర్థంగా మాట్లాడుతూ ప్రభావితం చేయగల తటస్థులపై ప్రలోభాల ఎరవేస్తూ వారిని తన గళాలుగా మార్చుకునే కుటిల యత్నాలను కూడా వైసీపీ ప్రారంభించినట్లు తెలుస్తోంది.



అరుదైన సినిమా అవుతుంది



“గామి' అరుదైన సినిమా. ఆరేళ్లపాటు అంకితభావంతో తెరకెక్కించడం మామూలు విషయం కాదు. సినిమాపై ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన 'గామి' చిత్రం ట్రైలర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇది రెగ్యులర్ చిత్రం కాదు. మాస్ అంశాలు ఉండవు. అయినా 'గామి' ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు తర్వాత ఏం జరగబోతోందో అనే ఉత్సుకత ప్రేక్షకుల్లో కలుగుతుందని విద్యాధర్ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారికీ, సాయం చేసిన వారికి నిర్మాత శబరీషన్ ధన్యవాదాలు తెలిపారు.

అరి అన్వేషణ



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అరి'. 'పేపర్‌బాయ్' ఫేం జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి వినోద్ వర్మ క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గ్రంథాలయంలో తీక్షణంగా శోధిస్తున్న లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: కృష్ణ ప్రసాద్


శ్రీవిష్ణు డబుల్ ధమాకా



గురువారం హీరో శ్రీవిష్ణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన కథానాయకుడిగా రెండు కొత్త చిత్రాలను నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంయుక్తంగా కార్తీక్‌రాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పకులు. 'ఎస్ వీ 18' వర్కింగ్ టైటిల్. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. అలాగే హసిత్ గోలీ దర్శకత్వంలో శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రానికి 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

మనసు నొచ్చుకుంటే మన్నించండి

నాగేంద్రబాబు



వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగేంద్రబాబు మాట్లాడుతూ 'ఆరడుగుల మూడంగుళాలు ఉండే హీరోలు పోలీసు పాత్రలు చేస్తే బావుంటుంది. ఐదడుగుల మూడంగుళాలు ఉండే హీరోలయితే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంద'ని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు టాలీవుడ్ హీరోల అభిమానులు సోషల్ మీడియాలో నాగబాబు తీరును తప్పుపట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా నాగేంద్రబాబు స్పందించారు. 'ఎవరినో తక్కువ చేయాలని అలా మాట్లాడలేదు, నా మాటల వల్ల ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే క్షమించండి' అని కోరారు.

ముచ్చటగా మూడోసారి



నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ముచ్చటగా మూడోసారి ఓ సినిమాను పట్టాలెక్కించనున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో కథానాయకుడిగా ప్రియదర్శి నటించనున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సూపర్ హిట్ కాంబోగా పేరున్న వీరిద్దరి నుంచి గతంలో వచ్చిన రెండు చిత్రాలూ విశేష ప్రేక్షకాదరణను పొందాయి. దీంతో ఈ మూడవ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'జెంటిల్‌మేన్' 2016లో విడుదలై భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ సినిమాలో నాని, నివేథా థామస్, సురభి నటించారు. ఆ తర్వాత 2017లో వచ్చిన మరో సూపర్ హిట్ చిత్రం 'సమ్మోహనం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో సుధీర్ బాబు, అదితి రావు హైదరీ ప్రధాన పాత్రలు పోషించారు.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణె



బాలీవుడ్ బెస్ట్ కపుల్స్‌లో ఒకరిగా పేరొందిన దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ జంట అభిమానులకు తీపి కబురందించారు. త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చారని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2013లో రణ్‌వీర్, దీపికా 'రామ్‌లీలా'లో కలిసి నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఇరువురూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 2018లో వీరిద్దరూ ఇటలీలో ఘనంగా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.



మంచి సినిమాతో వస్తున్నాం

శివ కందుకూరి



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శివ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా వచ్చాయి. అందుకే ఏదో కొత్తదనం ఉంటే తప్ప అలాంటి సినిమా చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర నారాయణ' చిత్ర కథ విన్నాక కొత్తగా అనిపించింది. ఎందుకంటే ఇందులో మైథాలజీ ఎలిమెంట్ కూడా ఉంది. దిష్టి బొమ్మ చూస్తుంటాం. కానీ అసలు ఎందుకది అనే విషయాన్ని పట్టించుకోం. దీని గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. ఆ కథకు క్రైమ్, డిటెక్షన్ అంశాలు జోడించాం. కచ్చితంగా ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తుండడం మరింత బలాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో... ఎస్ 99



సి.జగన్ మోహన్ దర్శకత్వంలో యతీష్, నందిని నిర్మించిన 'ఎస్ 99' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఇటీవలే నిర్వహించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందివ్వాలనే ఉద్దేశంతో విలక్షణ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నామని దర్శకుడు తెలిపారు. ఇది విజువల్స్, సౌండ్ ప్రధానంగా సాగే కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమన్నారు. ఎటువంటి నేరచరిత్ర లేని ఒక వ్యక్తి క్రైమ్‌కు పాల్పడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించడమే కథాంశమని వివరించారు. సినిమాకు టీం స్పిరిట్ ప్రధానమని, ఈ విషయంలో మాకు మంచి టీం దొరికిందని నిర్మాత యతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

జానపద, సినీగాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత




ప్రముఖ జానపద, సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్(64) గురువారం ఉదయం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇందిర, కుమార్తె మానస ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల ప్రదర్శనలను ఇచ్చిన శ్రీనివాస్ తొలిసారిగా 'నమస్తే అన్న' చిత్రంలో 'గరం... గరం... పోరీ... నా గజ్జెల సవారీ' పాట పాడారు. ఆ తర్వాత నాగార్జున 'కింగ్' సినిమాలో 'గింత, గింత బాల చుక్కవే' పాట పాడారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' చిత్రంలో శ్రీనివాస్ పాడిన 'గన్ను లాంటి కన్నులున్న...' పాట ఎంతో హిట్ అయ్యింది. ఈ పాటకు 2012 సంవత్సరంలో ఉత్తమగాయకుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. గురువారం సాయంత్రం వడ్డేపల్లి శ్రీనివాస్ అంత్యక్రియలు సీతాఫల్‌మండి శశ్మానవాటికలో జరిగాయి.

బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)











వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

న్యాయం అడిగితే కేసులతో వేధింపులు

- 1535వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 29: రాజధాని అమరావతికి జీవనాధారమైన మూడు పంటలు పండే భూమినిచ్చిన తమపై అక్రమ కేసులు పెడతారా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1535వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, న్యాయం జరిగేంతవరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. అక్రమ కేసులకు భయపడం.. వెనక్కి తగ్గమన్నారు. ఐదు కోట్లమంది రాజధాని అమరావతి కావాలని కోరుకుంటుంటే మంత్రులు విశాఖలో రహస్యంగా కార్యాలయాలు ప్రారంభిస్తుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

భార్య హత్య కేసులో జీవిత ఖైదు

గురజాల లీగల్, ఫిబ్రవరి 29: భార్యను హత్య చేసిన భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళితే.. మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన ఎస్కే నాగుర్ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి మాచర్ల పట్టణానికి చెందిన లాలు కుమార్తె మస్తాన్‌బీతో వివాహం జరిగింది. భార్యతో తరచూ గొడవ పెట్టుకుంటూ కొడుతుండే వాడు. జూలై 13, 2017న మధ్యాహ్నం సమయంలో మస్తాన్‌బిని పలుగుతో పొడిచి హత్య చేశాడు. అత్తమామల ఫిర్యాదుతో కేసునమోదు కాగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ గురజాల 10వ అదనపు జిల్లాకోర్టు న్యాయాధికారి జి.వెంకటేశ్వర్లు తీర్పు వెల్లడించారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మండాదిలో జరిగింది. గ్రామానికి చెందిన మూలంరెడ్డి శ్రీనివాసరెడ్డి (50) మూడేళ్లుగా తనకున్న రెండెకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. అననుకూల పరిస్థితులతో రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనపడక మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

7న వేమూరులో చంద్రబాబు పర్యటన

- ప్రజాస్వామ్య విలువలను కాలరాసే జగన్‌కు బుద్ధి చెప్పాలి
- టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పని చేయాలి
- మాజీ మంత్రి ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 29: వేమూరు నియోజకవర్గంలో ఈనెల 7న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రమైన వేమూరు ఎన్టీఆర్ పురవేదికవద్ద వేమూరు మండల టీడీపీ, జనసేన శ్రేణుల సమన్వయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనను నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన శ్రేణులు విజయ వంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాసి అధికార దాహంతో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని, అందుకు టీడీపీ, జనసేన శ్రేణులు సంసిద్ధగా ఉండాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం రెండు పార్టీలతో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. గెలుపు దిశగా సమన్వయంతో ముందుకు నడవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను నయవంచనతో పాలించిన జగన్‌కు విలువైన ఓటు ద్వారా చావు దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన వార్డుల వారీగా సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లను చైతన్య పరచాలన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు నడిపే విధంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు సాగిస్తున్నారన్నారు. యువత, మహిళలకు ప్రాధాన్యమిస్తూ ప్రకటించిన మేనిఫెస్టో వివరాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుందని కేవలం 40 రోజుల వ్యవధిలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావు, ఘంటా స్వాతి, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, శివకృష్ణ, జనసేన నాయకులు అనూరాధ, రాజేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనం తథ్యం

- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నరేంద్రకుమార్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి29: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల కూటమి ప్రభంజనాన్ని సృష్టించి అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పెద్దింటమ్మ ఆలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ పేరిట ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు పంచిపెట్టి ఓట్లు అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ కూటమిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి తనకు ఉన్న అధికారాన్ని అడ్డుపెట్టుకొన్ని రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి దోచుకున్నారన్ని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు ఎంపీ అభ్యర్థులు వైసీపీ నుంచి పోటీ చేయకుండా తప్పుకుంటున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా, రేషన్, మద్యం మాఫియా, పేదల భూముల ఆక్రమణలు, వేల కోట్ల దోపిడీపై ఇటీవల పొన్నూరులో జరిగిన సభలో ప్రజాచార్జి షీట్‌ను విడుదల చేసినట్లు చెప్పారు ఈ అక్రమాలను నిలదీయకుండా విచారణ జరపకుండా దోపిడీకి పాల్పడిన కిలారి వెంకట రోశయ్యను జిల్లా స్థాయిలో దోచుకోమని ఎంపీ అభ్యర్థిగా ప్రమోషన్ ఇచ్చారన్ని ఎద్దేవా చేశారు. మహిళలు మంగళహారతులు పట్టి నరేంద్ర కుమార్ దంపతులను తమతో పాటు గ్రామంలోని తీసుకెళ్లారు. ప్రచారం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.

ప్రత్తిపాటి కుమారుడి అరెస్టు అక్రమం

- భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
- సీఎం దిష్టిబొమ్మ దహనం





చిలకలూరిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 29: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్‌బాబు అక్రమ అరెస్టు పట్ల గురువారం చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అరెస్టువార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాటి పుల్లారావు నివాసం వద్దనున్న టీడీపీ శ్రేణులు బయటకువచ్చి నిరసన తెలిపారు. భరత్ బాబు అరెస్టును ఖండించారు. సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి 'సీఎం జగన్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. జగన్ దిష్టిబొమ్మను దహనంచేశారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో మంగళగిరి వద్దనున్న టీడీపీ కేంద్ర కార్యాలయం వద్దకు తరలి వెళ్ళి పుల్లారావుకు బాసటగా నిలిచారు.

అక్రమ కేసులతో వేధింపులు : పుల్లారావు

రాజకీయ క్షేత్రంలో నేరుగా ఎదుర్కోలేక జగన్ అక్రమ కేసులతో ప్రత్యర్థులపై వేధింపులకు పాల్పడుతున్నారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. తన కుమారుడు శరత్ బాబును అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కంపెనీలో డైరెక్టర్‌గా గానీ, కనీసం వాటాదారుడిగా లేని తన కుమారుడిపై జీఎస్టీ ఎగవేతల ఉల్లంఘన కేసులు ఎలా పెడతారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారుల ద్వారా బనాయిస్తున్న ఇటువంటి తప్పుడు కేసులకు బెదిరేది లేదని స్పష్టంచేశారు. తన కుమారుడి స్టేట్‌మెంట్ తీసుకోవటం కోసమని పిలిచి అదుపులోకి తీసుకొని అనుకూల మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని ధ్వజమెత్తారు. తన కుటుంబానికి ఉన్న విశ్వసనీయతను దెబ్బతీయటానికే ఇలా చేస్తున్నారని అన్నారు. అక్రమ కేసులకు భయపడేదే లేదని, వాటిని చట్టపరంగా ధీటుగా ఎదుర్కొంటామని ఆయన వివరించారు. చిలకలూరిపేటలో మంత్రి రజిని వైఫల్యాలే వైసీపీ ఓటమికి బాటలు పరిచాయని చెప్పారు. చిలకలూరిపేట నుంచి తన సీటు నాలుగురోజుల క్రితం పార్టీ ఖరారు చేసిన రోజు సాయంత్రం రెవెన్యూ ఇంటిలిజెన్స్ తమ కుమారుడిపై కేసు నమోదు చేసిందన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారని ఆయన చెప్పారు.





విజయవాడ బందరురోడ్డులోని పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ కార్యకర్తలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నాగులేరుకు కృష్ణా జలాలు..

- పల్నాడు కలెక్టర్ శివశంకర్

దాచేపల్లి, ఫిబ్రవరి 29: దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చడం కోసం నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో కలిసి ఎమ్మెల్యే కాసు నాగులేరును పరిశీలించి నీటి ఎద్దడికై ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేయడం ద్వారా నాగులేరుకు ఇరువైపులావున్న కారంపూడి, దాచేపల్లి మండలాలకు చెందిన 30కిపైగా గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కార మవుతుందని తెలిపారు. నాగులేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించామని, నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే కాసు వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి మునిసిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, జడ్పీటీసీ మూల గుండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కటకం జయశ్రీ, కోట కృష్ణ, టమాట సుభాని, మందపాటి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోచుకునేందుకే భూహక్కు చట్టం

- గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్



మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్

గుంటూరు(లీగల్),ఫిబ్రవరి29:ప్రజల ఆస్తులను దోచుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిం దని గుంటూరుబార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్ అన్నారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈచట్టం ప్రకారం అన్ని రకాల స్థిరాస్తులపై రెవెన్యూ శాఖవారే హక్కులను నిర్ధారిస్తారని, వారి తీర్పులపై అప్పీలును రెవెన్యూశాఖ పరిధిలోని జాయింట్ కలెక్టర్‌కు అప్పజెప్పార న్నారు. వారి తీర్పులపై హైకోర్టుకు వెళ్ళవలసిందేనని, జిల్లా, క్రింది కోర్టులకు ఆ తీర్పులలో జోక్యం చేసుకొనే హక్కు లేద న్నారు. ఈ చట్టం యాజమాన్య హక్కులకు అత్యంత ప్రమాదకర మని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి అనేక రూపాల్లో నిరసన వ్యక్తంచేస్తున్నా ప్రభుత్వం ఈ చట్టాన్ని సమర్థిస్తూ రీ-సర్వే పేరుతో అమలు చేస్తుందని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని మొత్తం 149 బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో ఒక మహాసభ నిర్వహించి, ఈ చట్టాన్ని రద్దు చేసేవరకు ఉద్యమించాలని బార్ అసోషియేషన్ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా మార్చి 2న ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు రాష్ట్రంలోని అన్ని బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గుంటూరు బార్ అసోషియేషన్ ఉద్యమ కమిటి సభ్యులు ఎన్. రామ్మోహన్‌రావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్. బ్రహ్మానంద రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిగురుపాటి రవీంద్రబాబు, కొల్లి శంకరరావు, లావు అంకమ్మ చౌదరి, మాజీ ఏపీపీ కాళిదాసు, సిద్దా సత్యనారాయణ, అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, నంబూరు పాములు, పీ.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

అడ్డగోలుగా అధికార దుర్వినియోగం

- ప్రజల రక్తాన్ని తాగుతున్న పిన్నెల్లి సోదరులు
- టీడీపీ-జనసేన మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 29: నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డగోలుగా వాడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం పట్టణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి వైసీపీ నేతలు పోలీస్‌శాఖ కళ్లకు గంతలు కడుతున్నారని మండిపడ్డారు. ఘర్షణ సమయంలో కర్రలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఏ షాపు నుంచి తెచ్చారు.. కర్రతలతో వచ్చింది ఎవరు.. టీడీపీ నేతల చేతిలో కర్రలు, కత్తులు, రాడ్లను ఎవరైనా చూశారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అబద్ధాలు చెప్పడం పిన్నెల్లి సోదరులకు పరిపాటిగా మారిందన్నారు. అన్నీ బ్రహ్మారెడ్డిపై నెడుతున్నారని ఎద్దేవా చేశారు. రెంటచింతల మండలం మంచికల్లులో రెచ్చగొట్టింది ఎవరు.. దాడి చేసింది ఎవరు.. అంటూ ప్రశ్నించారు. బురద జల్లడం, దాడులు చేయడం వంటి వాటిపై స్థానిక ఎమ్మెల్యే పథకం రచిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. వైసీపీ నుంచి కార్యకర్తల వలసలు ఎక్కువయ్యాయని, దీన్ని నిరోధించేందుకు గొడవల్లో ఇరికించాలని చూస్తున్నారని అన్నారు. 20 ఏళ్ల క్రితం జరిగిన మర్డర్లు గురించి మాట్లాడుతున్నారని, ఇరువురు ముస్లింలను చంపించిన ఘనత నీది అంటూ ఎమ్మెల్యే పీఆర్కేను ఉద్దేశించి అన్నారు. టీడీపీ నేతలు నిసిగ్గుగా 307 కేసులు పెడుతున్నారన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన దాడితో ఎటువంటి సంబంధం లేని కేశవరెడ్డి, గురవారెడ్డి, మురళీలపై కేసులు నమోదు చేశారన్నారు. పోలీస్‌స్టేషన్లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేసే పరిస్థితి లేదన్నారు. జెండాచెట్టు వద్ద ఘర్షణలో ఒక వలంటీరు, కౌన్సిలర్ భర్త కర్రలు పట్టుకొని దాడికి దిగారన్నారు. జనసేన నేత బూసా రామాంజనేయులు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పోలీసు అధికారులు తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. బ్రహ్మారెడ్డి వెంట జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, గుండెబోయిన సాంబశివరావు, గంధం మల్లయ్య, కేసానుపల్లి కృష్ణబాబు, వెంకటరమణ, మదీనా, లాల్ కృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

అధికారం అండతో గెలవాలని కుయుక్తులు

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె ధ్వజం

గుంటూరు, ఫిబ్రవరి 29: ఐదేళ్ల పాలనలో ప్రజావిశ్వాసం కోల్పోయిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, వలంటీర్లను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగం చేసైనా గెలుపొందేందుకు విఫలయత్నం చేస్తున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. గురువారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అనేది వైసీపీ అధినేత, రూ.కోట్లాది ప్రజాధనంతో ఏర్పాటు చేసుకొన్న సొంత సైన్యమని గాదె ధ్వజమెత్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన ఓటర్లను వలంటీర్ల సహకారంతో ప్రలోభపెట్టి లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. నిన్న మంగళగిరిలో జరిగిన వలంటీర్ల సమావేశంలో 19 విధి విధానాలు కలిగిన నిర్ణయ పత్రాలను వారికి అందజేసిన విషయం నిజం కాదా? అంటూ గాదె నిలదీశారు. ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, గుంటూరు నగరంలో ఉన్న వలంటీర్లతో సమావేశం నిర్వహించి రూ.25 వేల నగదు అందజేశారని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి ఎన్నికలకు రావాలని ఆయన సవాల్ విసిరారు. వలంటీర్ల వ్యవస్థతో రాజకీయ లబ్ధి పొందాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలపై త్వరలో గవర్నర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు యర్రంశెట్టి పద్మావతి, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, సిరిగిరి శ్రీనివాస్, చింతా శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీని మొదటి స్థానంలో నిలపాలి

- గతంలో అవకతవకలపై తలదించుకోవాల్సి వచ్చింది
- సర్వసభ్య సమావేశంలో చైర్మన్ రాము

గుంటూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్న గుంటూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకును మరింత అభి వృద్ధి పథంలో నడపాలని బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజ నేయులు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని బ్యాంకు సమావేశ మందిరంలో గురువారం బ్యాంకు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకారశాఖను మరింత బలోపేతం చేశార న్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇటీవల జరిగిన ఓ సదస్సులో సొసైటీలో జరిగిన అక్రమాలపై తల దించుకోవాల్సి వచ్చిందని రాము ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో జరిగే అక్రమాలపై తాము చర్యలు తీసుకోవచ్చు కానీ సొసైటీలో జరిగే అక్రమాలపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదన్నారు. త్వరలో ఎన్నికల రానున్నాయని, రైతులకు వద్దకెళ్ళి ఓట్లు అడగాల్సి ఉంటుందని, ఈ పరిస్థితుల్లో ఏ సమస్యలు ఉత్పన్నం కాకూడదని సూచించారు. అనంతరం 2024-25 బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో సీఈవో కృష్ణవేణి, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

1,30,299 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,40,562 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,30,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,06,923 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20500
నెంబరు. 5	13000	18800
273	11000	15000
341	9000	20500
4884	13000	16500
సూపర్ 10	12500	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9000	20400
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12500



అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న నరేంద్రవర్మ, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఫిబ్రవరి 29 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంక కాల్వకట్ట మీద నివాసం ఉంటున్న గోసాని సాంబయ్య గృహం ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై కోల్పోవటంతో బాధితుడికి గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, మాజీ ఎంపీటీసీలు షేక్ బాజి, కట్టా సుజాత, పఠాన్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్త

కర్లపాలెం, ఫిబ్రవరి 29 : మండలంలోని పెదపులుగువారిపాలెంకు చెందిన వైసీపీ కార్యకర్త తిరుమలరెడ్డి జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, కోమట్ల లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ తీర్థంపుచ్చుకున్నాడు. వేగేశన నరేంద్రవర్మ పార్టీ కండువా కప్పి ఆయను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, పరిశా గోపిరెడ్డి పాల్గొన్నారు.

అక్కల కృష్ణారెడ్డికి వేగేశన పరామర్శ

కర్లపాలెం, ఫిబ్రవరి 29 : కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెంకు చెందిన అక్కల కృష్ణారెడ్డి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఇంటి వద్ద ఉండగా వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి గురువారం అక్కల కృష్ణారెడ్డిని పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అక్కల కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటూ అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, అక్కల వెంకటరెడ్డి, పరిశాగోపిరెడ్డి, జనసేనపార్టీ మండలాధ్యక్షుడు గోట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్ర ఉన్నారు

నరేంద్రవర్మకు ఓటు బాపట్ల అభివృద్ధికి మలుపు

● బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ

బాపట్ల, ఫిబ్రవరి 29: నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు ఓటు బాపట్ల అభివృద్ధికి మలుపు అని పార్లమెంట్ మహి ళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. పట్టణంలోని 2వవార్డు 46వ బూత్ పరిధిలో గురువారం మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ మొదటిసారిగా ఓటు హక్కు పొందిన వారికి అవగాహన కల్పిస్తూ ఓటు పొందని వారితో ధరఖాస్తు చేయించారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 20లక్షల ఉద్యో గాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి కల్పిస్తారన్నారు. కావున ప్రతి ఒక్క రు తెలుగుదేశంకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ సాంబశివరావు, శ్రీను, నవనీతం, మస్తాన్‌బి, షేక్.నజ్మా, దగ్గుమల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని 2వవార్డులో మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని తదితరులు

సీతారాముల విగ్రహ పునఃప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలు నిర్వహించిన అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని కొత్రావారి వీధిలో ఉన్న సీతారాముల దేవాలయంలో గురువారం విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని కాలనీవాసులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని సీతారాముల వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నంసతీష్ ప్రభాకర్

నాంచారమ్మతల్లి ఆలయానికి రూ.5 లక్షల విరాళం

కర్లపాలెం, ఫిబ్రవరి 29 : మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామంలో పునర్ని ర్మాణం చేయనున్న గ్రామదేవత శ్రీనాంచారమ్మతల్లి ఆలయానికి అన్నం సతీష్ ప్రభాకర్ గురువారం భూమిపూజలో పాల్గొని శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో మాడసాని ముసలయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఓటువేద్దాం రాష్ట్ర కళా యాత్ర'ను జయప్రదం చేయాలి

బాపట్ల, ఫిబ్రవరి 29 : ఓటువేద్దాం రాష్ట్ర కళాయాత్రను జయప్రదం చేయండంటూ గురువారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో బాపట్ల ఆహ్వానకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీసీ సాయిబాబు, కోట వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన బాపట్ల ఎన్జీవో హోంలో ఓటు వేద్దాం, ప్రజాస్వామ్యాన్ని బలోపే తం చేద్దాం రాష్ట్ర స్థాయి ఓటరు చైతన్య కళాయాత్ర జయప్రదం చేయాలని ప్రజా సంఘాల తరఫున పిలుపునిచ్చారన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రాణమని ప్రజలందరు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని తెలిపారు. 2024లో జరగనున్న ఎన్నికలు అత్యంత కీలకమైనవని భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటం, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెం పొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీహరి, కార్యదర్శి జేవీ కృష్ణారావు, ప్రొఫెసర్ కారుమంచి విజయ్‌కుమార్, సాహితిభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, శంకర్‌ప్రసాద్, జీవి బ్రహ్మం, ఎస్ఎన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు

ఆధారాలు లేని ఆరోపణలు సరికాదు

● వైసీపీ పట్టణాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు

బాపట్ల ఫిబ్రవరి 29 : హైవేలింకు రోడ్డు విస్తరణ పనుల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయటం తగదని వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు అన్నారు. ఈ విషయమై గురువారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేని ఆరోపణలు చేయటం సరికాదన్నారు. డివైడర్ నిర్మాణం ఇంజనీరింగ్ అధికారుల మార్కింగ్ ప్రకారం జరుగుతుందన్నారు. విస్తరణ పనుల విషయంలో ఏ ఒక్కరి వద్ద డబ్బులు వసూళ్ళు చేసినట్లు ఆధారాలు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సమావేశంలో నాయకులు చింతల రాజశేఖర్, సీకే నాయుడు, జోగి రాజా, ఎన్ వెంకట్రావు, ఇనపగోళ్ళ రంగారావు, ఇమ్మడిశెట్టి అంకమ్మరావు, షేక్ సయీద్‌పీర్, ఇనగలూరి మాల్యాద్రి, పి.శ్రీధర్‌రెడ్డి, నర్రా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలన అంతమొందించాలి

● కొల్లూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● పార్టీ నేతలతో ఎన్నికల సన్నాహక సమావేశం

కొల్లూరు, ఫిబ్రవరి 29: జగన్ అరాచక పాలన అంతమొందించే సమయం వచ్చిందని, నిత్యం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలు గుర్తించారని మాజీమంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు, కొల్లూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఎన్నికలు సన్నాహక కార్యక్రమంలో భాగంగా టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఈ నాలుగు సంవత్సరాల 10 నెలల కాలంలో రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశారన్నారు. వేమూరు నియోజకవర్గంలో మూడుసార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తే ప్రజలు రెండుసార్లు గెలిపించి మంత్రిని కూడా చేశారన్నారు. తన హయాంలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశానని, 2019లో తనపై గెలిచిన నాగార్జున మంత్రి పదవి చేపట్టి కూడా ఒక్క అభివృద్ధి కూడా చేయకపోగా, ఆరు నెలలు ముందే నియోజకవర్గాన్ని వదిలి వెళ్లిపోయారన్నారు. మరో చోట పదేళ్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మరో వ్యక్తి ఇక్కడకు వచ్చారని, వైసీపీకి అభ్యర్థులే దొరకకపోవడంతో ఇలాంటి మార్పులు చేస్తూ మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విభేదాలు లేకుండా సమన్వయంతో పని చేసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య,



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జీఎల్‌జీ భగవాన్, జనసేన మండల కన్వీనర్ బి.చలమయ్య, ఉపసర్పంచ్ ధూళిపూడి కృష్ణ, టీడీపీ నాయకులు పబ్బిశెట్టి సత్యకుమార్, గోరికపూడి ప్రసాద్, శొంఠి సత్యనారాయణ, తోట సాంబయ్య, జనసేన నేతలు గాజుల నగేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు, వెలివెల శివసుబ్రహ్మణ్యం, రావూరి పాండురంగారావు, ఈమని పవన్, యర్రు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎండీ సాధిక్, ప్రధానోపాధ్యాయిని కె.హసురా

ఆన్‌లైన్ సైన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

● జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాధిక్

బాపట్లటౌన్, ఫిబ్రవరి 29: సైన్స్‌డే పురస్కరించుకొని 25వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ క్విజ్ పోటీల్లో ఈపూరుపాలెం 9వ తరగతి విద్యార్థిని ఊట్ల హిమబిందు రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించినట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎండీ సాధిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.హసురా తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రయోగాత్మక పరిశోధనలపై దృష్టి సాధించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే సైన్స్ టాలెంట్‌టెస్టులు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయటానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఊట్ల హిమబిందును పాఠశాల ఉపాధ్యాయులు పద్మజ, కేవీ సుజాత, కె.కోటేశ్వరి, సీహెచ్‌వీ కుమారి, వి.లక్ష్మీదేవి, రత్నకుమారి, డి.సరళకుమారిలు అభినందించారు.

గంగాపార్వతి లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బాపట్లటౌన్, ఫిబ్రవరి 29 : మండలంలో అప్పికట్ల గ్రామంలో ఉన్న శ్రీగంగాపార్వతి సమేత లింగేశ్వరస్వామి దేవాలయం నందు టీడీపీ, జనసేనపార్టీ నాయకుల తో కలిసి వేగేశన నరేంద్రవర్మ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివపార్వతి మహోత్సవాల్లో అప్పికట్లలో నిర్వహించే తిరునాళ్ల అంగరంగవైభవంగా 100 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారని ఈ ఏడాది కూడా కన్నుల పండుగగా గ్రామస్థులంతా ఐక్యంగా నిర్వహిస్తుండటం ఎంతో అభినందనీయమని వేగేశన నరేంద్రవర్మ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాటినార, తాటిబొత్తలతో తయారు చేసిన ప్రత్యేక రథంలో స్వామివారిని పరిసర ప్రాంతాల్లోని భక్తులంతా గ్రామవీధుల్లో రథోత్సవం నిర్వహించటం భక్తులను ఎంతో ఆకట్టుకుంటుందన్నారు. అనంతరం తాటిబొత్తలతో తయారు చేసే రథ నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించటం భక్తులకు ఎంతో శుభసూచికమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఇనగంటి గాంధీ, అచంట విజయ్‌కుమార్, కుర్రా ప్రభాకర్, బి.హనుమాన్‌జీ, అప్పాసాని మహేంద్రనాథ్‌చౌదరి, ఇనగంటి అనురాధ పాల్గొన్నారు.

సీతారామనాయుడు సేవలు అభినందనీయం : ఎస్పీ

బాపట్ల, ఫిబ్రవరి 29: సుదీర్ఘకాలంగా పోలీసుశాఖలో విశేష సేవలందించిన ఎస్ఐ వి.సీతారామనాయుడు సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీసుశాఖలో ఎస్ఐగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సీతారామనాయుడును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ, సిబ్బంది ఘనంగా సన్మానించారు. 41 సంవత్సరాలు పాటు పోలీసుశాఖలో ఆయన పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జునరావు, వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ సీతారామనాయుడుని సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

బాపట్ల, ఫిబ్రవరి 29 : భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బాపట్ల పట్టణంలో జరిగింది. పట్టణ ఎస్ఐ రజాక్ తెలిపిన వివరాల ప్రకారం రైలుపేటలోని భావరాజుతోటకు చెందిన గుమ్మడి రజనీని భర్త సుబ్బారావు తాగి వచ్చి తిట్టి, కొట్టటం పరిపాటిగా మారింది. అధిక కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండటంతో ఈ నెల 25వ తేదీన ఎలుకల మందు పేస్ట్ థమ్సప్‌లో కలుపుకొని తాగింది. స్థానికులు గుర్తించి పొన్నూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ ప్రారంభించిన ఎమ్మెల్యే కోన

కర్లపాలెం, ఫిబ్రవరి 29: కర్లపాలెం మండలంలోని పాతనందాయపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం ప్రారంభించారు. కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోన ప్రభాకరరావు విగ్రహాలను ఎమ్మెల్యే కోన ఆవిష్కరించి పేదలకు వైఎస్సార్ ఇళ్ళస్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, తూనుగుంట్ల జగన్, ఎంపీ టీసీ తాండ్ర సాంబశివరావు, షేక్ ఆసిఫ్ ఆలి, వైసీపీ నాయకులు చీరాల సత్యనారాయణరెడ్డి, కావూరి శ్రీనివాసరెడ్డి, స్థలదాత, తూనుగుంట్ల జగదీష్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, పోతురాజు కోటేశ్వరమ్మ, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

వైభవోపేతంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రత్యేక అలకారంలో కోదండరామస్వామి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 29 : మండలంలోని వెల్లటూరులో కోదండ రామస్వామి దేవాలయ పునఃప్రారంభోత్సవం, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా జరిపించారు. అనం తరం ధ్రువ కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా దేవస్థా న అభివృద్ధి కమిటీ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలో గల రామమందిరంలో హనుమత్ లక్ష్మణ సీతాసమేత రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను వేల్పూరి శ్రీనివాసరావు, వేల్పూరి కనకారావు, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, వేల్పూరి నారాయణరావు, వేల్పూరి నాగేశ్వరరావులు అందజేశారు.

బలిజేపల్లిలో...

వేమూరు, ఫిబ్రవరి 29: మండలంలోని బలిజేపల్లి గ్రామంలో పునర్నిర్మితమైన రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11.25 నిమిషాలకు వైభవంగా నిర్వహించారు. పండిత మామిళ్ళపల్లి వెంకట సుబ్బరాయశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో హనుమత్ సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబుకు వేదపండితులు కమిటీ సభ్యులు ఘనం గా పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన పేరుమీద స్వామివారికి పూజలు జరిపించి ఆశీర్వదించి సత్కరించారు. ప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిపి అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, గ్రామ అధ్యక్షుడు నిజాంపట్నం సత్యనారాయణ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్, మాజీ ఎంపీ టీసీ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పరిశా శివరామకృష్ణ, వేజండ్ల గంగాధర్, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, జనసేన నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు. శాలివాహన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠా కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు వల్లూరు బుజ్జిబాబు, వేజండ్ల మల్లికార్జున, అప్పారావు, యర్రవరపు రాములు పర్యవేక్షించారు.

విద్యార్థులందరూ సైంటిస్టులుగా ఎదగాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 29: విజ్ఞాన శాస్త్రం మానవ జీవితంలో విడదీయలేనంతగా విస్తరించిందని నేటి విద్యార్థులందరూ సైంటిస్టులుగా మారాలని యూఎస్‌ఏలో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థి సైంటిస్టు పమిడిముక్కల విజయ్‌కుమార్ అన్నారు. వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ సైన్సుడేను పురస్కరించుకుని విజ్ఞానశాస్త్ర ప్రదర్శనను నిర్వహించగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.అరుణకుమారి, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, రెడ్డి సుధాకర్, కె.శివరామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర

కొల్లూరు, ఫిబ్రవరి 29 : ప్రజాపోరు యాత్రను బీజేపీ నాయకులు గురువారం నిర్వహించారు. బీజేపీ వేమూరు అసెంబ్లీ కన్వీనర్ గల్లా వెంకట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కొల్లూరు మండలంలోని దోనేపూడి, తోకలవానిపాలెం, కిష్కిందపాలెం, తిప్పలకట్ట, కృష్ణనగర్, పోతార్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల్లో ప్రజాపోరు యాత్రలో భాగంగా ప్రచార రథంతో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వికసిత్ భారత్ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగ్గున గణేష్‌బాబు, ఆ పార్టీ నాయకులు కోట్ల వెంకటరామకృష్ణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మందా జనార్దన్, గోపినాథ్, జొన్నకూటి శివనాంచార య్య, సుబ్రహ్మణ్యం, చిట్టా రాములు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, భట్టిప్రోలు బీజేపీ ప్రధాన కార్యదర్శి మురుగుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేక విద్యాసంస్థలో ప్రమోషన్ డే వేడుకలు

కొల్లూరు, ఫిబ్రవరి 29: స్థానిక కాకతీయ కళ్యాణ మండపంలో వివేక విద్యా సంస్థ ప్రమోషన్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థుల కు విద్యోన్నతి పత్రాలను విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు నల్లూరి వెంకటేశ్వరరావు, డైరెక్టరు రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గుత్తా వెంకటరత్నం, కె.రామరాజు అందజేశారు. ప్రమోషన్ డేలో భాగంగా 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు పట్టభద్రుల వేషధారణ ధరించి పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యోన్నతి పత్రాలు అందజేస్తున్న విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు వెంకటేశ్వరరావు

భావదేవుని ఆలయానికి రాష్ట్ర పర్యాటకశాఖ గుర్తింపు

బాపట్ల, ఫిబ్రవరి 29 :పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి ఆలయానికి రాష్ట్ర పర్యాటకశాఖ గుర్తింపు లభించింది. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా తొలిదశలోనే బాపట్ల ఆలయానికి ప్రత్యేకటూర్ ప్యాకేజి లభించటం బాపట్ల ప్రజల చిరకాలవాంఛ నెరవేరినట్లైందని చరిత్ర పరిశోధకులు, జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు.

ఎంపీడీవోగా రాఘవేంద్రనాథ్

కర్లపాలెం, ఫిబ్రవరి 29: కర్లపాలెం నూతన ఎంపీడీవోగా రాఘవేంద్రనాథ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో రాఘవేంద్రరావును కలిసి పరిచయం చేసుకున్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : అనగాని శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 29: పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తూ వారికి అండగా ఉంటామని అనగాని శివప్రసాద్ అన్నారు. జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో నిజాంపట్నం మండలం గాజువారిపాలెంకు చెందిన వైసీపీ నాయకుల తాడికొండ రాఘవ, శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, సాంబయ్య, తిరుమలేశ్వరరావు, గాజుల శివ, శ్రీను, తోటకూర కోటయ్య, టి.మల్లికార్జున్‌రావు, సింగంశెట్టి నాగేశ్వరరావు, వెంగళస్వామి, సుందరరెడ్డి, మరో 30కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులను అనగాని శివప్రసాద్ టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్‌యాదవ్, సురేష్‌యాదవ్, పందరబోయిన కృష్ణ, మరకా ముసలయ్య, కుమారస్వామి, బొమ్మిడి రామకృష్ణ, నాయుడు గోపి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గాజువారిపాలెంకు చెందిన వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనగాని శివప్రసాద్

అనగానితోనే రేపల్లె అభివృద్ధి సాధ్యం

● టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తాతా ఏడుకొండలు

రేపల్లె, ఫిబ్రవరి 29: రేపల్లె నియోజకవర్గం అభివృద్ధి అనగాని సత్యప్రసాద్‌తోనే సాధ్యమని బాపట్ల పార్లమెంటరీ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తాతా ఏడుకొండలు అన్నారు. గురువారం పట్టణంలోని 15, 16 వార్డుల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగం గా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో రోజురోజుకు అరాచకాలు పెరిగిపోయా యన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలపై ప్రేమ ఉన్నట్లు కపట నాటకం ఆడుతున్నారన్నారు. రాబోయే 40రోజుల్లో ప్రతి టీడీపీ, జనసేన కార్యక ర్తలు సైనికుల్లా పనిచేసి టీడీపీ గెలుపు దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావటం ఖాయమని వైసీపీ పాలనకు మంగళం పాడటం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, గోగినేని పట్టాభి రామారావు, మేకా రామకృష్ణ, కసుకుర్తి సంగీత్, దున్నా జయప్రద, మోర్ల అరుణ, నాగశ్రీ, పి.లక్ష్మీనరసింహ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, ల్యాబ్ కిసోర్, దేవగిరి రంగా, వెలుగోటి ధర్మారావు, మద్దుల అంకాలు, యార్లగడ్డ చిన్నబాబు, సజ్జా ప్రసాద్, కేసన కృష్ణారావు, అగస్టీన్, తదితరులు పాల్గొన్నారు.



16వ వార్డులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నేడే నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

రేపల్లె, ఫిబ్రవరి 29: ప్రతి కార్యకర్తకు టీడీపీకి సైనికుల్లా పనిచెయ్యాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్థానిక ఎంపీఏ హాల్లో టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమా వేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నియోజకవర్గ రాష్ట్రస్థాయి నాయకులు, మండల, గ్రామ, వార్డు కమిటీ సభ్యులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్లు, సాధికార కమిటీ సభ్యు లు, యువత పాల్గొని జయప్రదం చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, బొర్రా సురేంద్ర, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వెల్లువెత్తుతున్న చేరికలు

● ఆనందబాబు సమక్షంలో చేరిన వైసీపీ శ్రేణులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 29: వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని కోనేటిపురం పంచాయతీ శివారు పడమటిపాలెం గ్రామంలోని వైసీపీకి చెందిన ఏడు కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. గుంటూరులోని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తాతా పోతురాజు ఆధ్వర్యంలో బొర్రా మాణిక్యరావు, పడమటి సుబ్రహ్మణ్యం, పడమటి ఏడుకొండలు, వాకా వెంకటేశ్వరరావు, జంపని రవి, పడమటి రంగనాథ్ తదితరులు టీడీపీలో పనిచేసేందుకు నిశ్చయించుకుని పార్టీలో చేరినట్లు తెలియజేశారు. ఆనందబాబు చేసిన అభివృద్ధే ఆయనను గెలిపిస్తుందని ఆయనపై నమ్మకంతోనే పార్టీలో చేరామన్నారు.



పడమటిపాలెం గ్రామస్థులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 29 : మెట్ట రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని హార్టికల్చర్ డీహెచ్‌వో జెన్నమ్మ అన్నారు. మండలంలోని పెదపులివర్రులో గురువారం ఆయిల్‌ఫామ్ సాగుపై అజం త సోయ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నా రు. హార్టికల్చర్ అధికారుల సూచనలతో సాగు చేపట్టి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. లంక పరివాహక ప్రాంతాల్లోని మెట్ట భూములు ఆయిల్‌ఫామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు ప్రత్యేక దృష్టి పెట్టి సాగు చేయాలని ఆమె కోరా రు. పెదపులివర్రులోని నాదెళ్ళ రామకోటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రం లో ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించి రైతు లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి లలితకుమారి, నీలా రమేష్, కంపెనీ డైరెక్టర్ అభయ్ గోయెల్, వీఎస్ రెడ్డి, షేక్ భాషా, పి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ డీహెచ్‌వో జెన్నమ్మ

జక్రయ్య సేవలు అభినందనీయం : ఎస్ఈ రవీంద్ర

బాపట్ల, ఫిబ్రవరి 29: కలెక్టరేట్‌లోని కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన టి.జక్రయ్యను గురువారం బాపట్ల టౌన్‌హాల్లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి గుంటూరు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎస్ఈ బీఏ రవీంద్ర, బాపట్ల ఈఈ పి.సుబ్బరాయులు రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల అధ్యక్షుడు కె.రామారావు పాల్గొని జక్రయ్య సేవలను కొనియాడారు. ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. సహచర ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


ముప్పవరంలో కశ్యాపురం నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పంగులూరు, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీ పాలనలోనే జరిగిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో రేణంగివరం, బూదవాడ, కోటపాడు, కశ్యాపురం, కొప్పెరపాడు గ్రామాలకు చెందిన నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు సైకో పాలన సాగుతోందన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో విధ్వంసకర పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల ముందు ముద్దులు పెట్టిన జగన్ అనంతరం ప్రజలందరితో పాటు మీడియా వర్గాలను పిడిగుద్దులు గుద్దారని అన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేయించి ప్రజలకు అన్నం అందకుండా చేసిన జగన్ పెత్తందారుడు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్ మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడని ముద్రవేసి ప్రాణం తీశారని చెప్పారు. ఇది జగన్ అరాచక పాలనకు పరాకాష్ట అని రవికుమార్ అన్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు. జగన్ పాలనలో గంజాయి, శ్యాండ్, లిక్కర్ మాఫియాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. జగన్ రెడ్డి పాలనలో డ్రగ్స్, కల్తీ లిక్కర్ మాఫియా, శ్యాండ్ మాఫియా, మహిళలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని గొట్టిపాటి అన్నారు.

తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన కూటమి నిర్వహించిన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జనసేన మండల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలు సమన్వయంతో సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, రావూరి రమేష్, ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఆదిశేఖర్, మానం సుబ్బారావు, ఓబుల్‌రెడ్డి, చిన్నా, శ్రీనివాసరెడ్డి, జనసేన నాయకులు వెంకటహనుమ, పాలెపు వీరాంజి, ఫణికుమార్, తిరుపతయ్య, సందీప్, వినోద్, రాంబాబు పాల్గొన్నారు.

గొట్టిపాటికి శ్రీనివాసరెడ్డి సంఘీభావం

పంగులూరు, ఫిబ్రవరి 29: వైసీపీ మండల కన్వీనర్ ఎర్రం శ్రీనివాసరెడ్డి ఆపార్టీ సభ్యత్వానికి, మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన ఎర్రం శ్రీనివాసరెడ్డి గురువారం చిలకలూరిపేటలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలసి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదల్ని అప్పులపాలు చేసిన సీఎం

పర్చూరు, ఫిబ్రవరి 29: ఇళ్ల నిర్మాణం పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరినీ అప్పులపాలు చేశారని ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదలచేశారు. ఏడాదికి 5లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి, మాట తప్పి మడమ తిప్పారన్నారు. ఉచితంగా ఇళ్లు ఇవ్వకపోగా గృహ నిర్మాణం పేరుతో పేదలను అప్పుల పాలు చేశారని పేర్కొన్నారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించి వారిచే ఇళ్లు కట్టించి అప్పులపాలుచేశారన్నారు. ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరి పేరుతో రూ.35వేల చొప్పున మొత్తం రూ.3,866 కోట్లు అప్పులు తెచ్చి మహిళల నెత్తిన వేల కోట్లు అప్పులు పెట్టారని ఆరోపించారు. దీంతోపాటు టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి రూ.10వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. ఓటీఎస్ పేరుతో ఎన్టీఆర్, చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా రూ.10వేల నుంచి రూ.30వేలు జగన్‌రెడ్డి వసూలు చేశారని మండిపడ్డారు. ఊరికి దూరంగా నివాస యోగ్యంకాని స్థలాను పేదలకు అంటకట్టారన్నారు. గతంలో చంద్రబాబు నిరుపేదలకు రెండు సెంట్లు ఇస్తే దాన్ని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సెంటుకు కుదించిందన్నారు. రూ.7వేల కోట్లకుపైగా ఎమ్మెల్యేలు, మంత్రులు సెంటు పట్టాలో కుంభకోణం చేశారని ఆరోపించారు.

తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన జండా సభ జనజాతరతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. అధికార పార్టీ ఆటంకాలు సృష్టించినా కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయన్నాయని దీనికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు.

అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

» ప్రతిరోజు సంతకాలు చేసి పలాయనం
» అర్జీదారులు ఫోను చేస్తే ఫీల్డు విజిట్ అంటూ చెబుతున్న వైనం
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు


బల్లికురవ సచివాలయంలో సిబ్బందిలేక ఖాళీగా ఉన్న కుర్చీలు


బల్లికురవ గ్రామ సచివాలయం

బల్లికురవ, ఫిబ్రవరి 29: ప్రభుత్వం ఒకవైపు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు గ్రామాల లోనే మెరుగైన సేవలను అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సచివాలయాలలో సిబ్బంది ఉండటం లేదు. సమస్యల పరిష్కారానికి వెళ్లిన ప్రజలకు అక్కడ ఖాళీ కుర్చీలు దర్శన మిస్తున్నాయి. ఏ సమయంలో ప్రజలు వెళ్లినా సిబ్బంది ఫీల్డు విజిట్‌లకు వెళ్లారనే సమాదానం వస్తుంది. విజిట్‌లకు వెళ్లిన వారు ఎక్కడ ఉన్నారంటే మాత్రం మాట దాట వేస్తున్నారు. మండల స్థాయిలో పర్యవేక్షించే అధికారులు కూడా విజిట్‌లు చేయకపోవటం వలనే ఇలాంటి పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండల కేంద్రంలోని గ్రామ సచివాలయానికి ఏసమయంలో వెళ్లినా పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన కొందరు అర్జీరులు సమస్యల పరిష్కరం కోసం సచివాలయానికి వెళ్లగా.. అక్కడ డిజిటల్ అసిస్టెంట్, మహిళ పోలీస్ మాత్రమే ఉన్నారు. మొత్తం 9 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఏడుగురు మాత్రం ఫీల్డు విజిట్‌లకు వెళ్లినట్లు రికార్డులో వ్రాసిపెట్టి వెళ్లారు. ఇదేంటి తాము ఎప్పుడూ వచ్చిన సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండకుండా డుమ్మా కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫీల్డు విజిట్‌లకు వెళ్లిన సిబ్బందికి కాల్ చేస్తే ఎక్కడ ఉన్నారో చెప్పకుండా దాట వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సచివాలయానికి ఉదయం పూట వచ్చి వెంటనే సంతకాలు చేసి విధులకు డుమ్మా కొడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలోనే పనితీరు ఇలా ఉంటే మిగిలిన సచివాలయాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అని పలువురు చర్చించుకుంటున్నారు.

బల్లికురవ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హెల్త్ ఏఎన్ఎం, డిజిటల్ అసిస్టెంట్, మహిళ పోలీస్‌తో పాటు తొమ్మిది మంది డ్యూటీలో ఉండాలి. అయితే, ఇద్దరు మాత్రమే ఉండటంతో సచివాలయాలు పెట్టటం దండగ అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో బల్లికురవ సచివాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి లబ్ధిదారులకు పథకాలు అందించాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ఒక ఆడియో రికార్డు కూడా బయటకు వచ్చింది. దీనిపై అధికారులు నామమాత్రంగా విచారణ చేశారు తప్ప చర్యలు చేపట్టలేదని ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడిందని, సమస్యలు సకాలంలో పరిష్కారం కావటం లేదని, ఏ పని చేయాలన్న చేతులు తడపాల్సి వస్తుందని అర్జీదారులు ఆరోసిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సచివాలయాలను తనిఖీలు చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

» 37 అంశాలు కొద్దిపాటి చర్చతో ఆమోదం


మాట్లాడుతున్న జంజనం శ్రీనివాసరావు

చీరాల, ఫిబ్రవరి 29: మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం జరిగింది. గురువారం కౌన్సిల్ హాల్లో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ప్రజల సమస్యలపై మాట్లాడింది శూన్యం. అజెండాలోని 6వ అంశం స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ముఖ ద్వారంకు తుది మెరుగులు, సెక్యూరిటీ గది నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.5లక్షల అంచనా వ్యయంగా కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. దీనిపై 16వ వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ స్థల దాతల పేర్లు, తదితర విషయాలు ఆ అంశంలో పొందుపరచలేదని, రద్దు చేయాలని కోరారు. ఆ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదావేసి, తరువాత చర్చించి నిర్ణయం తీసుకుందామని ఒకరు, ఎప్పుడైనా ఇదే ప్రస్తావన ఉంటుంది కాబట్టి ఆమోదించాలని మరొకరు ఇలా కౌన్సిలర్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఈక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ అనే పేరులో మార్పు ఉండదని, అయితే దాతలు ఎవరైతే ఉన్నారో వారి పేర్లు ఒక శిలాఫలకంపై రాసి అందరికి కనిపించేవిధంగా ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలు అందరితో చర్చించి నిర్ణయం తీసుకుందామన్నారు. కౌన్సిలర్ మించాల సాంబశివరావు మాట్లాడుతూ ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ పేరు మార్పును ప్రభాకరరావు కోరుతున్నారని పేర్కొన్నారు. ఆయన కోరుతుంది పేరు మార్పు కాదు, దాతగా వారి తాతయ్య పేరు కూడా నమోదు చేయాలంటున్నారని చైర్మన్ వివరణ ఇచ్చారు. దీంతో సాంబశివరావు ఆ పదాన్ని సవరించుకున్నారు. అదే అంశంపై 25 వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ తాను ఎస్ఆర్ పీఎం హైస్కూల్లో చదువుకున్నానని, ఎస్ఆర్ అండ్ పీఎం హై స్కూల్ అని మా సర్టిఫికెట్లలో ఉంది. అది కూడా మారుస్తారా అని ప్రశ్నించారు. 17వ వార్డు కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ తన దగ్గర ఉన్న సమాచారం మేరకు ఆ స్కూల్‌కు సంబంధించి స్థల వితరణ, భవన నిర్మాణాల తాలీకు పూర్వాపరాలు వివరిస్తూ ఆ అంశాన్ని యథాతథంగా ఆమోదించాలని కోరారు. తన మాటకు విలువలేదంటూ - మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోడంటూ కౌన్సిలర్ ప్రభాకరరావు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఆ అంశాన్ని ఆమోదించారు. ఆతరువాత 7వ అంశానికి సంబంధించి కాంట్రాక్టర్లు టెండర్లు వేసే క్రమంలో కొందరు ఉద్దేశపూర్వకంగా అంచనా విలువకన్నా భారీగా తక్కువకు కోట్ చేస్తూ అభివృద్ధిని ఆటంకపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ విషయమై కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడి అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చేయాలని కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనీల్‌లు అధికారులకు చెప్తూ ఆ అంశాన్ని రద్దు చేయమని కోరారు. దీంతో ఆ అంశాన్ని రద్దు చేశారు. 17వ అంశాన్ని కూడా రద్దు చేశారు.

మొత్తం 39 అంశాలలో రెండు అంశాలు రద్దు కాగా, మిగిలిన అంశాలు కొద్దిపాటి చర్చతో ఆమోదించారు. చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మొత్తం 36 మంది సమావేశానికి హాజరుకావల్సి ఉంది. అయితే, చైర్మన్‌తో సహా 19 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో డీఈ ఏసయ్య, ఏఈ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతి చెందిన నాగబ్రహ్మం

మార్టూరు, ఫిబ్రవరి 29: తండ్రి అస్థికలను విజయవాడ దగ్గర కృష్ణా నదిలో కలిపి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవరుపై చోటుచేసుకుంది. ఒంగోలు వైపు వెళుతున్న టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న అన్న గుడిపాటి నాగబ్రహ్మం (40) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న తమ్ముడు సాంబశివరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి వచ్చి సాంబశివరావును మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రామిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగబ్రహ్మం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముందు ఖాళీగా వెళుతున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగం అదుపుకాలేక బలంగా ఢీకొనడంతో నాగబ్రహ్మం తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు భావిస్తున్నారు.

బాధితులు మేదరమెట్ల వాసులు

కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన నాగబ్రహ్మం, సాంబశివరావులు అన్నదమ్ములు. నాగబ్రహ్మంకు భార్య అరుణకుమారి, ఇద్దరు కవల మగ పిల్లలు ఉన్నారు. సాంబశివరావు సింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పని చేస్తున్నారు. గతంలోనే తల్లి చనిపోగా, ఈనెల 25న తండ్రి ఆది నారాయణ అనారోగ్యకారణంగా మృతి చెందాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో తండ్రి అస్థికలను కృష్ణా నదిలో కలపడానికి అన్నదమ్ములు ద్విచక్రవాహనంపై విజయవాడకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని తిరిగి బైక్ పై మేదరమెట్ల వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు నాగ బ్రహ్మం మృతదేహానికి శవపంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఉప్పుటూరు(పర్చూరు), ఫిబ్రవరి 29: దేవదాయశాఖకు సంబంధించి నిధుల దుర్వినియోగంపై రీజనల్ జాయింట్ కమిషనర్(ఆర్‌జేసీ) ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించి విధులు నిర్వహించిన అప్పటి ఈవో నాగేశ్వరరావు హయాంలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో దేవదాయశాఖ కమిషన్ ఆదేశాల మేరకు రీజనల్ జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషన్ పి.పానకాలరావు సారథ్యంలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా అలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి



సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని 15,16,17 వార్డులలో గురువారం సూపర్ సిక్స్ పథకాలు, మ్యానిఫెస్టో వివరాలు తెలిపే కరపత్రాలను నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఆ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక, అనైతిక, ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబుల లారీ పట్టివేత

బల్లికురవ, ఫిబ్రవరి 29: ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమమార్గంలో తరలి వెళుతున్న గ్రానైట్ స్లాబుల లారీని గురువారం మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్‌బాబు అదుపులోకి తీసుకొన్నారు. బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులో వెళుతున్న స్లాబుల లారీని అధికారులు నిలుపుదల చేసి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవటంతో లారీని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన లారీలో ఉన్న స్లాబులకు కొలతలు వేసి పెనాల్టీలు విధిస్తామని మైనింగ్ అధికారులు తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు సమస్యలను పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అనాసక్తి కనబరుస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమర్తపూడి శేఖర్‌బాబు అన్నారు. గురువారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో అద్దంకి పాత తాలూకా కేంద్రం వద్ద ధర్నాలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30శాతం తక్షణ చెల్లించాని, పెండింగ్‌లో ఉన్న కొత్త డీఏలు తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంకణాల శ్రీనివాసరావు, కరి రామయ్య, మలాది నాగరాజు, రమేష్‌బాబు, ఏలీషా, చెంచు రామారావు, రహమ్‌తుల్లా మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చీరాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, పెన్షనర్‌ల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం, కారంచేడు పరిధిలోని ఏపీటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

బీసీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 29: చినగంజాంలో మార్చి 5న జరిగే బీసీ సెల్ పార్లమెంట్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. గురువారం ఇంకొల్లులోని టీడీపీ కార్యాలయంలో బీసీ నేతలు సమావేశమయ్యారు. ప్రతి గ్రామం నుంచి ఆత్మీయ సమావేశానికి కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, సింగయ్య, సిద్ధు, వి.సాంబయ్య, వెంకయ్య, కె.వసంతరావు, ఆజాద్, గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: చినగంజాం మండల కేంద్రంలో మార్చి 5న నియోజకవర్గ స్థాయిలో తలపెట్టిన బీసీ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని బీసీ నేతలు కోరారు. ఇందుకు సంబంధించి గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోలూరి సింగయ్య, అన్నవరపు శ్రీనివాసులు(వాసు), కూరపాటి జగన్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఉప్పుటూరి నరేంద్ర, కాల్వ శ్రీనివాసరావు, నక్కల రాఘవ, మార్టూరి రామాంజనేయులు, అద్దంకి రామసుబ్బారావు, వి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను జయప్రదంచేయాలి

బల్లికురవ, ఫిబ్రవరి 29: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించాలని కోరుతూ మార్చి 3న అద్దంకిలో జరిగే ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలని అసంఘ నేతలు కోరారు. ఇందుకుసంబంధించి గురువారం బల్లికురవలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరసయ్య, పేతురు, రమేష్, ప్రసాద్, వీరయ్య, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో బాలాలయ ప్రతిష్ఠ

ఇంకొల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీచెన్నకేశవస్వామి దేవాలయ జీర్ణోద్ధరణలో భాగంగా బాలాలయ ప్రతిష్ఠ స్థాపన కార్యక్రమాలు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం శతాధిక ప్రతిష్ఠాపనాచార్య శ్రీ నారాయణం వెంకటరమణ దీక్షితులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. గ్రామప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, ఫిబ్రవరి 29: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం పర్చూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాబోలు రత్నాకర్‌రావు(58) స్వీట్‌హోమ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఎలుకల మందు సేవించగా, గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన పర్చూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మనస్తాపంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. గురువారం గుండ్లకమ్మ నదికి వెళ్ళేదారిలో ఉండే పేదలకు వాసవి క్లబ్ సభ్యులు ఫిబ్రవరి 29 లీప్ డే సందర్భంగా క్లబ్ అధికారుల ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఆంజనేయులు, ఉడుతు విజయలక్ష్మి, అంజలి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇట్టా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై పలు విషయాలను తెలియజేశారు. హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాంజనేయులు, అంకారావు, శ్రీనివాసరావు, జ్యోతి నిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'సింహగర్జన'ను విజయవంతం చేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. మాల మహాసభ, మాల మహానాడు, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో మార్చి 3న బాపట్లలో మాలల సింహగర్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకుసంబంధించి గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పులిపాటి బాబురావు, శాస్త్రి, జూనియస్, బుల్లిబాబు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కట్టిబోయిన శ్రీనివాసరావు(51) క్యాటరింగ్ చేస్తూ భార్య, ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నాడు. ఈక్రమంలో ఓ శుభకార్యానికి క్యాటరింగ్‌కు వెళ్లి అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా బాపట్ల వైపు వెళ్లే రైలు ఢీకొని మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

మార్టూరులో మూడు ఇంటర్ పరీక్షా కేంద్రాలు

మార్టూరు, ఫిబ్రవరి 29: ఇంటర్ మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమవుతున్నాయి. మార్టూరులోని మూడు పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు, అందుకు సంబంధించి ఈ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.వస్రాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు కేంద్రాలలో ఇంటర్ రెండు సంవత్సరాలకు సంబంధించిన 1047 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. వీరికోసం 45 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. మార్టూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 227 మంది, శ్రీహర్షిణి జూనియర్ కాలేజీలో 325 మంది, రాయల్ జూనియర్ కాలేజీలో 495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

మార్టూరు, ఫిబ్రవరి 29: విద్యాహక్కు చట్టం ప్రకారం రానున్న విద్యా సంవత్సరం 2024-25లో మండలంలోని ప్రతి ప్రయివేటు పాఠశాలలో పేద విద్యార్థులకు 1 వతరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని మండల విద్యాశాఖాధికారి ఎం.వస్రాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానం విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా అర్హులైన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. అవసరమైన వారు వచ్చే నెల 14వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జేడీ

మార్టూరు, ఫిబ్రవరి 29: స్థానిక జడ్పీ హైస్కూల్‌ను గురువారం ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ) కె.లింగేశ్వర రెడ్డి సందర్శించారు. ఈ హైస్కూల్లో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు గల వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం 8, 9వ తరగతులకు సంబంధించి సిలబస్, తరగతి గదులలో ఫ్యాన్లు, విద్యుత్, మరుగుదొడ్లు, ట్యాబ్‌ల వినియోగం తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంగ్లీషులో విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించేందుకు పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎం.వస్రాం నాయక్, ఎం.ప్రేమలత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వ్యాయామ సాధనాలు

చీరాల, ఫిబ్రవరి 29: స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన లేడీస్ జిమ్ నిర్మాణం తుదిదశకు చేరింది. త్వరలో ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు స్కూల్ ప్రాంగణం వాకర్స్ (పురుషులు, మహిళలు)కు అనువుగా ఉంది. యాంత్రిక జీవనంలో శారీరక శ్రమ తగ్గుతోంది. దీంతో ఎక్కువ మంది అవకాశం ఉన్నప్పుడు వాకింగ్, జిమ్‌లకు వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనేపథ్యంలో లేడీస్ జిమ్ నిర్మాణం చేపట్టి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఉయ్యాల, సేద దీరుతూ కూర్చునేందుకు అరుగులు, గార్డెన్ ఏర్పాటు చేశారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధి వెంకటేశ్వరరావు

చీరాల, ఫిబ్రవరి 29: స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లీప్ ఇయర్ (ఫిబ్రవరి 29)ను పురస్కరించుకుని గురువారం క్లబ్ కార్యాలయం 101 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వీవీ సత్యనారాయణ, సీహెచ్ సురేష్‌బాబు, వీఎస్ తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 29: అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద 1,3 సచివాలయాల పరిధిలో, సిండికేట్ వీవర్స్ కాలనీలో సచివాలయం-2 వద్ద గురువారం జరిగిన గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఏపీఎం సుబ్బారావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

మార్టూరు, ఫిబ్రవరి 29: సీపీఎస్ రద్దు చేయాలని,పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ లను వెంటనే విడుదల చేయాలని, కొత్తగా ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ స్కేలులో కలపాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం మార్టూరులో మండల కాంప్లెక్స్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ వై.సంధ్య శ్రీకి అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు మాడుగుల కిషోర్, షేక్ ఇర్షద్ జాహ, షేక్ జానీబాషా, కంభంపాటి ప్రశాంత్, పరిమి ప్రసన్నకుమారి, దేవరకొండ రేణుకామ్మ, సరోజ, ప్రమీల, నాదెండ్ల శ్రీనివాసరావు, రేపూడి శ్రీనివాసరావు, నాగిరెడ్డి, వీరయ్య, బండారు రాంబాబు, జయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పూనూరులో రథశాలకు శంకుస్థాపన

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 29: మండలంలోని పూనూరు గ్రామంలో గురువారం రథశాలకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామి వారి రథానికి, రథశాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నారాయణంచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ కు చెందిన అధికారులతో పాటు రాటకొండ హనుమంతరావు, వెంకట్, సందీప్ దీక్షితులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుకార్యక్రమాలకు హాజరుకానున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 29: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు పి.గుడిపాడు, 10.30కితమ్మవరం, 11 గంటలకు అనమనమూరు, 11.30కి చెరువుకొమ్ముపాలెం, 12 గంటలకు రామాంజనేయపురం, 12.30కి నూరేపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు నక్కబొక్కలపాడులో జరిగే కారక్రమాలకు హాజరు కానున్నారు.

డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


బేతపూడి ప్రసాద్

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే అన్ని విభాగాల్లో అధికారులు బదిలీ అయ్యారు. ఈక్రమంలో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ ప్రసాదరావును ఆకస్మికంగా బదిలీ చేస్తూ గత శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో బేతపూడి ప్రసాద్‌ను నియమించగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

జాండ్రపేట(చీరాలటౌన్), ఫిబ్రవరి 29: నాటుటసారా తరలిస్తున్న ఇద్దరు మహిళలను వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అదుపులోకి తీసుకున్నారు. అందిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన వీరిరువు గురువారం రాత్రి స్కూటీపై వేటపాలెం నుంచి చీరాలకు సుమారు 60 లీటర్ల నాటుసారా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ శేషగిరిరావు సిబ్బందితో జాండ్రపేట వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని సారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ చేపట్టారు.